



మహాశివలింగానికి అభిషేకం చేస్తున్న యువతి



ఆరబెట్టిన ధాన్యం

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

తొలిరోజు రూ.41 లక్షల విలువైన ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. తొలి రోజు శుక్రవారం కంకిపాడు మండలంలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. 20 మంది రైతుల నుంచి రూ.41లక్షల విలువైన ధాన్యం కొన్నారు. రూ. 20 లక్షల నగదును రైతుల ఖాతాల్లో జమ చేశారు. ధాన్యం లభ్యత ఆధారంగా కేంద్రాలను పెంచుతూ ఈ ఏడాది 302 కేంద్రాల ద్వారా 5.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నారు.

- రూ.20 లక్షలు రైతుల ఖాతాల్లో జమ
- 302 కేంద్రాల ద్వారా 5.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలే లక్ష్యం
- మరో వారం రోజుల్లో వరికోతలు ముమ్మరం
- వాతావరణంలో మార్పులతో రైతుల్లో గుబులు
- జిల్లాలో ధాన్యం కొనుగోలు చేస్తున్న మండపేట వ్యాపారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు శుక్రవారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 302 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 5.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. తొలిరోజు జిల్లాలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆరంభించారు. వరి కోతలు సాగే కొద్దీ ఆయా ప్రాంతాల్లో అవసరాలకు అనుగుణంగా కేంద్రాలను పెంచుతామని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ సృజన తెలిపారు. రైతులకు గన్నీ బ్యాగులను కూడా అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

వణికిస్తున్న వాతావరణం

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.64 లక్షల హెక్టార్లలో వరిసాగు జరిగింది. కంకిపాడు, ఉయ్యూరు పామర్రు, మచిలీపట్నం, గన్నవరం, చల్లపల్లి, ఘంటసాల తదితర మండలాల్లో తక్కువ రోజుల వ్యవధిలో పంట చేతికి వచ్చే వరి వంగడాలు వేయడంతో ఆయా పొలాలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో హార్వెస్టర్ల ద్వారా వరికోతలు పూర్తి చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి ముందస్తుగా వరినాట్లు పూర్తి చేసిన పొలాలు కోతకు వచ్చే అవకాశం ఉంది. గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో వరికోతలు చేపట్టాలా, వాయిదా వేయాలా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. శుక్రవారం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయి. శని, ఆదివారాల్లో కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన ఒకమోస్తరు వర్షం కురుస్తుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వరికోతలు పూర్తి చేసిన అనంతరం ధాన్యం పొలంలో నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించడం కష్టతరమవుతుందని రైతులు చెబుతున్నారు. యంత్రాలతో వరికోతలు పూర్తిచేయడంతో ధాన్యంలో తేమశాతం అధికంగా ఉంటోంది. వర్షం కురుస్తుండటంతో ధాన్యం ఆరబెట్టేందుకు అవకాశం లేని స్థితి నెలకొంది.

బ్యాంకు గ్యారెంటీలు సమర్పించింది 23 మంది మిల్లర్లే

జిల్లాలో 149 రైస్ మిల్లుల ద్వారా ఈ ఏడాది ధాన్యం ఆన్‌లైన్ పద్ధతిలో కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షాలు పడే అకాశం ఉంటే ధాన్యం తడవకుండా ఉండటం కోసం మిల్లులకు ధాన్యం త్వరితగతిన తరలించేందుకు ఆఫ్‌లైన్ పద్ధతిలో ధాన్యం కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం వాతావరణం కొంతమేర అనుకూలంగా లేకపోవడంతో టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు. తొలివిడతగా వరికోతలు ప్రారంభమైన కంకిపాడు, ఉయ్యూరు గన్నవరం, మచిలీపట్నం ప్రాంతాల్లోని 23 మంది మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీగా రూ.57.35 కోట్లు శుక్రవారం నాటికి చూపారు. మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ చూపితేనే ధాన్యం కొనుగోలుకు సంబంధించిన గన్నీ బ్యాగులను ఇస్తారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎఫ్‌టీపీ జనరేట్ అవుతుంది. రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం బిల్లులు జమచేయడానికి అవకాశం ఉంటుంది. తొలిరోజు రూ.41లక్షల విలువైన 175 టన్నుల ధాన్యం 20 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. రూ.20లక్షలను రైతుల ఖాతాల్లో జమచేశారు.

మండపేటకు ధాన్యం

యంత్రాల ద్వారా వరికోతలు పూర్తి చేసిన ప్రాంతాల నుంచి మండపేటకు చెందిన వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. 75 కిలోల బస్తాకు రూ.1,725 మద్దతు ధరగా చెల్లించాల్సి ఉండగా, తేమశాతం అధికంగా ఉన్న నేపథ్యంలో బస్తా ధాన్యం రూ.1,400లకు ఆ ప్రాంతానికి చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. స్థానిక మిల్లర్లు, వ్యాపారులు బస్తా ధాన్యం రూ.1,450 నుంచి 1,500లకు కొనుగోలు చేస్తున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా భారీ వర్షం కురిస్తే ధాన్యం తడిచి మరింతగా ధర తగ్గుతుందని, ధాన్యంలో తేమశాతం ఇప్పట్లో తగ్గదనే కారణాలతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకు ధాన్యం విక్రయించేస్తున్నారు.

ఆంక్షలు ఎత్తి వేయాలి

రైతులు పండించిన ధాన్యం తమకు ఇష్టం వచ్చిన మిల్లులకు, ఇష్టం వచ్చిన ధరకు విక్రయించుకునేలా కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అవకాశం కల్పించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. గతేడాది మిల్లర్లు ఎంతమేర లెవీ బియ్యం ఇచ్చారో అంతమేర మాత్రమే ఈ ఏడాది ధాన్యం మిల్లింగ్‌కు అనుమతులు ఇస్తామనే మెలిక పెట్టారు. దీంతో రైతుల నుంచి స్థానిక మిల్లర్లు అధిక మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. జిల్లా యూనిట్‌గా పరిగణించి రైతులు తమకు మద్దతు ధర అధికంగా ఇచ్చే మిల్లులకు ధాన్యం విక్రయించేలా నిబంధనలు సడలించాలని, మిల్లు యజమానులు, రైతులు కోరుతున్నారు. గతేడాది డిసెంబరు మొదటివారంలో కురిసిన భారీవర్షాల కారణంగా ధాన్యం తడిచిపోవడంతో జిల్లాకు చెందిన మిల్లర్లకన్నా, తిరుపతి, మండపేటకు తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు జిల్లారైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు. దీంతో స్థానికంగా ఉన్న మిల్లులు లెవీ బియ్యంను పూర్తిస్థాయిలో మరపట్టలేకపోయాయి గతేడాది లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే పూర్తిస్థాయిలో రైతులనుంచి ఈఏడాది ధాన్యం కొనుగోలు చేసేందుకు అవకాశం ఉండదని, ఈ అంశంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని మిల్లర్లు కోరుతున్నారు.



మంగినపూడి బీచ్‌లో భక్తుల సముద్ర స్నానం



భక్తజన కెరటం

మంగినపూడి బీచ్‌లో కార్తీక పౌర్ణమి వేడుకలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మచిలీపట్నం మంగినపూడి బీచ్‌కి శుక్రవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే సముద్ర స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. సముద్రునికి మంగళహారతులిచ్చారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు కాకినాడ, రేపల్లె, తెనాలి తదితర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అనంతరం నగరంలోని పాండురంగ స్వామిని దర్శించుకున్నారు.

6లో

గౌతంరెడ్డి ఎక్కడ?

- తీవ్రంగా గాలిస్తున్న మూడు ప్రత్యేక బృందాలు
- కడప, నెల్లూరు జిల్లాల్లో ఉన్నట్టు అనుమానం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పూనూరు గౌతంరెడ్డి... కమ్యూనిస్టు నేతగా ఎదిగి వైసీపీలో ట్రేడ్ యూనియన్ నేతగా ఓ వెలుగు వెలిగాడు. గండూరి ఉమామహేశ్వరశాస్త్రిపై హత్యాయత్నం కేసులో ప్రస్తుతం పలాయనం చిత్తగించాడు. ఈ కేసులో ఏ1గా ఉన్న గౌతంరెడ్డి కోసం పోలీసు బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. మూడు ప్రత్యేక బృందాలు ఊరూరు తిరుగుతున్నాయి. గౌతంరెడ్డి సామాజిక బలం ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై పోలీసులు దృష్టి పెట్టారు. దీని ప్రకారం చూస్తే ఆయన నెల్లూరు, కడప జిల్లాల్లో ఎక్కడో ఒకచోట ఉండి ఉండొచ్చని భావిస్తున్నారు. నెల్లూరు జిల్లాలో ఉంటే వైసీపీ నేతలే ఆయనకు ఆశ్రయం కల్పిస్తారు. అదే కడప జిల్లాలో అయితే కుమార్తె తరఫు బంధువులు ఆశ్రయం కల్పించే అవకాశం ఉంది. ఈ కేసులో ఉమామహేశ్వరశాస్త్రిపై దాడి చేసిన నలుగురు యువకులను పోలీసులు ఇప్పటికే జైలుకు పంపారు. గౌతంరెడ్డితో పాటు మరో నలుగురు పరారీలో ఉన్నారు. ఈ ఐదుగురి కోసం వేట సాగుతోంది. సాంకేతిక దర్యాప్తు కూడా కొనసాగుతోంది.

ప్రతిపాదనలు ఉన్నా ఓపెన్ కాని షీట్

గౌతంరెడ్డికి 1988 నుంచి నేరచరిత్ర ఉంది. కమిషనరేట్‌లో 42 కేసులు నమోదయ్యాయి. ఇందులో రెండు హత్యలు, రెండు మిగతా 6లో..

దివి రైతులకు కత్తెర పోట్లు

అడుగున్నరపైకి పోటు మట్టాలు

- ఉప్పునీటిలో వందలాది ఎకరాల పంట పొలాలు
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు



నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం వద్ద బల్లలు మునిగే వరకు వచ్చిన పోటు నీరు

6లో

తవ్వకాల కోసం తంటాలు

- దేవరపల్లి సొసైటీ భూముల్లో ఇసుక, బుసక తవ్వకాలకు వైసీపీ నేత స్కెచ్
- గతంలో టీడీపీ నాయకుడి హత్యలో ప్రధాన నిందితుడు
- ఇప్పుడు టీడీపీతో అంటకాగుతూ కాంట్రాక్ట్ కొట్టేసే కుట్ర
- ఇందుకోసం సొసైటీ సభ్యులకు రూ.1,000 చొప్పున పంపిణీ
- తవ్వకాలు జరిపాక మరింత ఇస్తానని ఆశలు
- తీవ్రంగా వ్యతిరేకించిన కొందరు సొసైటీ సభ్యులు

కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దేవరపల్లి ఫీల్డు లేబర్ కో ఆపరేటీవ్ సొసైటీ సభ్యులు

టీడీపీ కూటమి ప్రభుత్వంలో వైసీపీ నేతలు చక్రం తిప్పుతున్నారు. దేవరపల్లి సొసైటీ భూముల్లో ఇసుక, బుసక వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు నేరచరిత్ర కలిగిన ఓ వైసీపీ నేత ఇప్పటికే రూ.లక్షలు విరజిమ్మాడు. ఎరగా దళితులకు తలో రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేశాడు. ఎన్నికల్లో వైసీపీకి పనిచేసి, తాజాగా టీడీపీ నేతలతో అంటకాగుతున్న ఆ వైసీపీ నేత.. నేరచరిత్ర కలిగిన మరో వైసీపీ నేతకు భారీ మేలు చేకూర్చేలా ఈ స్కెచ్ వేశాడు. దీనికి స్థానిక దళిత టీడీపీ నేత కూడా జత కలిశాడన్న విమర్శలు వస్తున్నాయి.

తోట్లవల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలం దేవరపల్లి లంకలో 190 సర్వే నెంబరులో 42 ఎకరాలను ప్రభుత్వం 'దేవరపల్లి హరిజన ఫీల్డు లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ' కింద దళితులకు ఇచ్చింది. ఈ సొసైటీలో 148 మంది సభ్యులున్నారు. కొందరు భూములను సాగు చేసుకుంటున్నారు. అయితే, కృష్ణానది వరదలకు నదివైపున ఇసుక, బుసక మేట వేసిందని, దీనిని తవ్వి విక్రయించుకునేందుకు అనుమతి కావాలంటూ సొసైటీయేతర వ్యక్తి కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నాడు. ఈ అర్జీ తహసీల్దార్ కార్యాలయానికి చేరింది. ఈ అర్జీదారుడి వెనుక భద్రిరాజుపాలెం టీడీపీ నేత శ్రీనివాసరెడ్డి హత్యలో ప్రధాన నిందితుడు ఉన్నాడని ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి పనిచేసిన ఈ నేత ఆ తరువాత టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నాడు. నేరచరిత్ర కలిగిన వైసీపీ నేతకు బుసుక, ఇసుక కాంట్రాక్ట్ కట్టబెట్టేందుకు ముమ్మర కృషి చేస్తున్నాడు. ఇతనికి దళిత టీడీపీ నేత కూడా సహకరిస్తున్నట్టు తెలిసింది. ఇటీవల దేవరపల్లి దళితవాడలో సొసైటీ సభ్యులను సమావేశపరిచారు. ఒక్కొక్కరికీ రూ.1,000 చొప్పున పంపిణీ చేశారు. బుసక తవ్వకాలు జరిపితే ఒక్కొక్కరికీ రూ.10 వేల వరకు ఇస్తానని ఆశ చూపాడని సమాచారం. ఇలా డబ్బు పంచటాన్ని కొందరు సొసైటీ సభ్యులు వ్యతిరేకించారు.

రూ.15 లక్షలకు బేరం

సొసైటీ సభ్యులు దేవరపల్లి బాబూరావు, పెదపూడి కోటేశ్వరరావు, చోరగుడి సుధాకర్ శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఎం.కుసుమకుమారికి వినతిపత్రం అందించారు. నలుగురు వ్యక్తులు కలిసి రూ.15 లక్షలకు ఇసుక, బుసకను బయటి వ్యక్తులకు అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకుని, సభ్యులకు మాత్రం తలో రూ.వెయ్యి పంపిణీ చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని కలెక్టర్‌కు, ఆర్డీవోకు ఈ నెల 4న రిజిస్టర్ పోస్టుల ద్వారా ఫిర్యాదులు పంపించామని తెలిపారు. అయినా తమ వినతిని ఎవరూ పట్టించుకోలేదన్నారు. బుసక తవ్వకాలు జరిగితే వరదలకు సొసైటీ భూములకు ప్రమాదం ఏర్పడుతుందని వివరించారు. 2022లో కూడా సదరు వైసీపీ నేత తమను బెదిరించి బుసక తవ్వకాలు జరిపాడని, అడ్డుకుంటే జైలుకు వెళ్తారనడంతో బయటకు రాలేకపోయామన్నారు. ఆ వ్యక్తే ఇప్పుడు బయటి వ్యక్తికి బుసక, ఇసుక కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. అభ్యంతరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. భద్రిరాజుపాలెం టీడీపీ నేత శ్రీనివాసరెడ్డిని కిరాతకంగా హత్యచేసి జైలుకెళ్లి వచ్చిన వైసీపీ నేతకు బుసక, ఇసుక అనుమతులు రాకుండా టీడీపీ పెద్దలు అడ్డుకుంటారా, లేక తలొగ్గుతారా అనేది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

భక్త జన సంద్రం

» మంగినపూడిలో లక్ష మంది సముద్ర స్నానాలు » కిటకిట లాడిన శైవ ఆలయాలు



శివోహం..



మంగినపూడి బీచ్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో లక్ష మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కృష్ణాజిల్లాతో పాటు ఎన్టీఆర్, కాకినాడ, రేపల్లె, తెనాలి తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తెల్లవారుజామున మంగినపూడి బీచ్‌కు చేరుకుని పవిత్ర స్నానాలు చేశారు. కృష్ణా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు సముద్ర స్నానాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రి కొల్లు రవీంద్ర ఉదయాన్నే సముద్ర స్నానం చేసి సముద్రుడికి మంగళహారతులిచ్చారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, సనాతన సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా బీచ్‌లో పుణ్యస్నానాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రానున్న కాలంలో బీచ్‌ను పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంద్రకీలాద్రి దుర్గమ్మ, మోపిదేవి, తదితర ఆలయాల నుంచి పెద్ద ఎత్తున పులిహోర, చక్రపొంగలిని భక్తులకు పంపిణీ చేశారు. పిల్లలు, వృద్ధులకు పాలు అందజేశారు. డీపీవో అరుణ, ఆర్డీవో స్వాతి, ఏఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ సుబాన్, బందరు ఎంపీడీవో వెంకటేష్, తహసీల్దార్ మదన్‌మోహన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కూటమి నేతలు గొర్రెపాటి గోపీచంద్, లంకే శేషగిరి, లంకే హరికృష్ణలు బీచ్‌లో ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. కుంచే నాని, పిప్పళ్ల కాంతారావు, పీవీ ఫణికుమార్‌లు పాల్గొన్నారు. పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేసి మైకులో ఎప్పటికప్పుడు సూచనలిస్తూ పర్యవేక్షించారు. పోలీసు వ్యానులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తీరం వెంబడి గజ ఈతగాళ్లతో అప్రమత్తత పాటించారు. భక్తులు దీపారాధనలు చేశారు. కూష్మాండ దానాలు జరిపారు.

పాండురంగని సేవలో కలెక్టర్ దంపతులు

మచిలీపట్నం టౌన్ : పాండురంగని బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ జిల్లాలనుంచి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కుబడులు సమర్పించుకున్నారు. కలెక్టర్ డీకే బాలాజీ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. కలెక్టర్ దంపతులకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆర్డీవో స్వాతి, డీఎస్పీ సుబాన్, ఆర్‌పేట సీఐ నబీ, ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు, ఆర్‌పేట సీఐ ఏసుబాబు, తహసీల్దార్ మదన్‌మోహనరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రుక్మిణి అమ్మవారికి కుంకుమ పూజ, పల్లకి ఉత్సవం, గోపాలకుల ఉత్సవం నిర్వహించారు. భక్తులకు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు అన్నదానం చేశారు.

పాలకాయితిప్ప బీచ్ వద్ద..

కోడూరు : కార్తీకపౌర్ణమి సందర్భంగా కోడూరు మండల పరిధిలోని పాలకాయితిప్ప బీచ్ వద్ద భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు సాగర తీరానికి చేరుకుని స్నానాలు ఆచరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రత్యేక వైద్యశిబిరం, దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం అల్పపీడనం కొనసాగుతున్న క్రమంలో సముద్ర పోటు ఎక్కువగా ఉండి అలల వేగం కారణంగా భక్తుల సంఖ్య తగ్గిందన్నారు. గతేడాది సుమారు 20 వేలమంది రాగా.. ఈసారి 10 వేల మంది వరకు వచ్చినట్టు సమాచారం.



సముద్రుడికి మంత్రి రవీంద్ర పూజలు



మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలుచేశారు. తీరం వద్దకు బస్సులు, కార్లు అనుమతించకపోవటంతో సముద్రపు కరకట్ట నుంచి బీచ్ వరకు సుమారు 2 కిలోమీటర్లు కాలి నడకన వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సముద్ర ఉధృతి కారణంగా తీర ప్రాంతం ఉప్పునీటిమయంగా మారింది. డాల్ఫిన్ భవనం చుట్టూ ఉప్పునీరు నిలిచిపోయింది. మెరైన్, ఫిషరీస్, పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా భక్తులు సముద్రంలో లోతుకు వెళ్లకుండా తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో అవనిగడ్డ సీఐ యువకుమార్, కోడూరు ఎస్‌ఐ చాణిక్య, అవనిగడ్డ, నాగాయలంక ఎస్‌ఐలు రాజేష్, శ్రీనివాస్, 60 మంది పోలీసు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా కార్తీక నదీ దీపోత్సవం

పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక మునేటిలో కార్తీక దీపం నదీ హారతులను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేదపండితులు అర్చకుల వేదమంత్రోచ్ఛరణలతో దీపోత్సవాన్ని శాస్త్రోక్తంగా మునేటిలో నిర్వహించారు. ముందుగా అమ్మవారి దేవస్థానంనుంచి తిరుపతమ్మ గోపయ్య స్వాముల ఉత్సవ మూర్తులను మేళ తాళాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా మునేటి వద్దకు తీసుకువచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం గంగామాతకు హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, డిప్యూటీ కమిషనర్ బీవీఎస్ఎస్.కిషోర్ కుమార్, సిబ్బంది పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పాలకాయితిప్ప బీచ్ వద్ద పవిత్ర స్నానాలు



కట్టలేరులో కొట్టుకుపోతున్న బాలుడు, రక్షించి ఒడ్డుకు చేరుస్తున్న స్వాములు (ఇన్‌సెట్‌లో)

కట్టలేరులో బాలుడి మునక.. రక్షించిన స్వాములు

నందిగామ రూరల్, నవంబరు 15 : దాములూరు గ్రామానికి చెందిన తెలుగుయువత నేత నేలవెల్లి సిద్దార్థ, అతడి స్నేహితులు కలిసి వైరా కట్టలేరులో కొట్టుకుపోతున్న బాలుడిని రక్షించి ప్రాణాలు కాపాడారు. సేకరించిన వివరాల మేరకు.. దాములూరు గ్రామానికి చెందిన కుంచం కృష్ణ కుమారుడు ప్రవీణ్ కొణతమాత్మకూరు జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రవీణ్ స్నేహితులతో కలిసి వైరాకట్టలేరులో స్నానానికి వచ్చారు. ఏటిలో దిగిన వారు లోతు ఎక్కువ ప్రదేశంలో ఈత కొడుతుండగా ప్రవీణ్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఆలయ సమీపం అయ్యప్ప దీక్షలో ఉన్న సిద్ధార్థ, అతడి స్నేహితులు గోపీచంద్, కనకయ్య, నరసింహారావు, మురళిలు ప్రవీణ్‌ను గమనించి తాడు సాయంతో కాపాడి ఒడ్డుకు తెచ్చారు. బాలుడిని రక్షించిన స్వాములను గ్రామస్థులు అభినందించారు.



హైవేపై ఆటోనగర్ క్రాసింగ్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఆటోనగర్ రోడ్డు క్రాసింగ్ వద్ద రక్షణ చర్యలు

జగ్గయ్యపేట, : జగ్గయ్యపేట సమీపంలో జాతీయరహదారిపై ఆటోనగర్ రోడ్డు క్రాసింగ్ వద్ద ఎట్టకేలకు అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనిగండ్లపాడుకు చెందిన వ్యవసాయకూలీ దోసపాటి బిక్ష్యాలు మృతి చెందటంతో పెద్ద ఎత్తున రోడ్డు క్రాసింగ్‌ను మూసివేయాలన్న డిమాండ్ వచ్చింది. పోలీస్ రికార్డుల ప్రకారం అదే ప్రాంతంలో జరిగిన ప్రమాదాల్లో 16మంది ప్రాణాలు కోల్పోయారు. ఎంతో కాలంగా ఆటోనగర్ వద్ద రోడ్డు క్రాసింగ్ మూసివేయాలని కోరుతూ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హైవే అథారిటీ అధికారులకు లేఖ రాశారు. గురువారం ప్రమాద ఘటనతో తాతయ్య అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. వైసీపీకి చెందిన వ్యక్తి రెస్టారెంట్ వ్యాపార ప్రయోజనాలు దెబ్బతింటాయని క్రాసింగ్‌ను మూసే సాహసం అధికారులు చేయలేదు. హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి శాశ్వతంగా డివైడర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పట్టణంలోకి ప్రవేశించే ప్రదేశాల్లో లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పోసానిపై కూటమి నేతల ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్ : టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై పోసాని కృష్ణమురళి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కూటమి నేతలు చిలకలపూడి సీఐ అబ్దుల్ నబికి ఫిర్యాదు చేశారు. తక్షణం అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పటిష్టంగా అమలు చేయాలి

» అధికారులకు కృష్ణా కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉచిత ఇసుక పాలసీని పటిష్టంగా అమలుచేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి శాండ్‌కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుకరీచ్‌లలో భారీ వాహనాలను అనుమతించవద్దన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై నిఘా ఉంచాలన్నారు. ఇసుకరీచ్‌లవద్ద చెక్‌పోస్టులు, సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి పర్యవేక్షించాలన్నారు. జిల్లా, డివిజన్‌స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇసుకరీచ్‌లను తనిఖీచేస్తూ ఉండాలన్నారు. ఇసుకరీచ్‌ల వద్ద ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుకపాలసీ నిబంధనలు, నదీ పరిరక్షణచట్టం, వాల్టా నిబంధనలు, హైకోర్టు, జాతీయ హరితట్రిబ్యునల్ ఆదేశాలు అమలు జరగుతున్నదీ లేనిదీ సాంకేతిక బృందాలు తరచూ తనిఖీలు చేయాలన్నారు. బందరుపోర్టు, ఉపాధి హామీ పథకం ద్వారా చేసే పనులకు జిల్లాలో రెండు ఇసుకరీచ్‌లను కేటాయించినట్టు తెలిపారు. జేసీ గీతాంజలిశర్మ ఏఎస్పీ వీవీ నాయుడు, గనులశాఖ ఏడీ కె.శ్రీనివాసకుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



జన జాతీయ దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

గిరిజన అమరవీరుల దినోత్సవం

గిరిజనులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నప్పటికీ ఆత్మగౌరవంతో బతుకుతారని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గిరిజన సంక్షేమశాఖ అధ్వర్యంలో గిరిజన అమరవీరులను స్మరిస్తూ జన జాతీయదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనులు విద్యకు దూరంగా ఉండటంతో, నేటికీ కొందరికి ఆధార్‌కార్డులు లేవన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేసి ఆధార్‌కార్డులను అందించేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వం స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజన అమరవీరుడు బిర్సాముండా స్ఫూర్తిని దేశవ్యాప్తం చేసే లక్ష్యంతో ఆయన జన్మదినాన్ని, జనజాతీయ గౌరవ దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, గిరిజన సంక్షేమశాఖ ఏడీ ఫణిదూర్జటి, గిరిజన సంఘం నాయకులు తదితరులు గిరిజన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గౌతంరెడ్డి ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

హత్యాయత్నాలు, ఒక డెకాయిటీ, రెండు దోపిడీ, రెండు చీటింగ్‌లు ఉన్నాయి. అతడిపై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. దీన్ని 2003లో తీసేశారు. తర్వాత 2004-2005లో గౌతంరెడ్డిపై రౌడీషీట్ తెరవడానికి అప్పటి పోలీసు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలు ముందుకు కదల్లేదు. దీనికి కారణాలు ఏమిటన్నది పోలీసులు పరిశీలిస్తున్నారు. రౌడీషీట్ ఎందుకు తీసేశారు, తర్వాత తయారు చేసిన ప్రతిపాదనలు ఎందుకు మూలనపడ్డాయి అనే అంశాలను బయటకు తీస్తున్నారు. కేసులను పరిశీలించాక తిరిగి షీట్ తెరిచే అవకాశాలు ఉన్నాయని సమాచారం. దీనిపై న్యాయనిపుణులతో చర్చించాక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రెండు లా అండ్ ఆర్డర్ బృందాలు, ఒక టాస్క్‌ఫోర్స్ బృందం గౌతంరెడ్డి ఆచూకీని తెలుసుకునే పనిలో ఉంది. కాగా, ఉమామహేశ్వరశాస్త్రి కేసుతో గౌతంరెడ్డి బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. తామంతా గౌతంరెడ్డి బాధితులమేనని చెబుతున్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆయన ఎన్నో అరాచకాలు చేశాడని వారంతా ఆరోపిస్తున్నారు.

వీలునామాను కూడా మార్చేసి..

ఉమామహేశ్వరశాస్త్రి స్థలాన్ని నకిలీ వీలునామా ద్వారా గౌతంరెడ్డి కాజేశాడు. ఉమామహేశ్వరశాస్త్రి తండ్రి రాసిన వీలునామా మొత్తంగా మార్చే పత్రాన్ని తయారు చేశాడు. దీనికి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు. దీన్ని అడ్డుపెట్టుకుని మొత్తం స్థలాన్ని గౌతంరెడ్డి మింగేశాడు. దీని గురించి తెలుసుకున్న బాధితుడు అప్పుడే సత్యనారాయణపురం పోలీసుల వద్దకు వెళ్లాడు. తన వద్ద అసలు వీలునామా ఉందని, గౌతంరెడ్డి వద్ద ఉన్నది నకిలీదని పదేపదే చెప్పాడు. దీనికి సంబంధించిన ఆధారాలు పోలీసులకు అందజేశాడు. దీనిపై చీటింగ్ కేసు నమోదు చేసి పోలీసులు వదిలేశారు. ఉమామహేశ్వరశాస్త్రి ఇచ్చిన వీలునామాలను పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు పంపితే నాడే అసలు నిజాలు బయటకు వచ్చేవంటున్నారు. అప్పటి పోలీసులు ఈ పని ఎందుకు చేయలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది.

దివి రైతులకు కత్తెర పోట్లు

అవనిగడ్డ/కోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో ఏర్పడు తున్న పెనుమార్పులతో సముద్రపు మట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో దివి ప్రాంత రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా సాగుతున్న పర్యావరణ విధ్వంసం కారణంగా సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని ముఖ్యంగా సముద్రపు మొగ (సిమౌత్)ల వద్ద ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని పర్యావరణ మంత్రిత్వ శాఖ గతేడాది జూలైలో చేసిన హెచ్చరికలు ఇప్పటి పరిస్థితికి అద్దం పడుతున్నాయి. నాగాయలంక మండలం గుల్లలమోద, నాలి, సంగమేశ్వరం, సొర్లగొంది ప్రాంతాలు, కోడూరు మండలంలోని తీర గ్రామాలైన రామకృష్ణాపురం, హంసలదీవి, పాలకాయితిప్ప, ఇరాలి ప్రాంతాల్లోనూ సముద్రపు పోటు మట్టం పెరగటంతో అవుట్ ఫాల్ స్లూయిస్ ద్వారా మురుగు కాలువల్లోకి ప్రవహిస్తున్న సముద్రపు నీరు మురుగుకాలువలను ముంచెత్తి అక్కడి నుంచి పంట పొలాల్లోకి రావటంతో రైతులు ఏమీ చేయాలో పాలుపోని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గడిచిన మూడు రోజులుగా నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలో గతంలో వచ్చే అమావాస్య, పౌర్ణమి, అష్టమ నవమి కత్తెర పోట్ల కంటే దాదాపు అడుగున్నర మట్టానికిపైగా పోటు మట్టం పెరుగుతుండగా, ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని కోడూరు, నాగాయలంక మండలాల్లోనూ తలెత్తి మురుగు కాలువల ద్వారా పంట పొలాల్లోకి నీరు చేరుతున్నాయి. వెంటనే ప్రభుత్వం స్పందించి సముద్రపు నీరు అవుట్ ఫాల్ స్లూయిస్‌ల ద్వారా పంట పొలాల్లోకి చేరే అవకాశం లేకుండా తక్షణమే అవుట్ ఫాల్ స్లూయిస్‌లను నిర్మించటంతోపాటు పోటు సమయాల్లో గేట్లను ప్రత్యేక పర్యవేక్షణలో మూసివేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



పాలకాయితిప్ప అవుట్ ఫాల్స్ స్లూయిస్ వద్ద ఎగువకు ప్రవహిస్తున్న ఉప్పునీరు

అధికారుల వైఫల్యం రైతుల పాలిట శాపం

డ్రైనేజీ, ఇరిగేషన్ శాఖ అధికారుల వైఫల్యం కోడూరు మండల దిగువ ప్రాంత రైతుల పాలిట శాపంగా మారింది. కోడూరు ఈస్ట్ చానల్ 15, 16, 17, 18 నంబర్ల కాలువల కింద గతంలో కురిసిన భారీ వర్షాలకు నారుమడులు నీటమునగటంతో మరలా రెండవ సారి నారుమడులు పోసి రైతులు వ్యవసాయ పనులు కొనసాగించారు. ఇదే క్రమంలో పాలకాయితిప్ప, కోడూరు అవుట్ ఫాల్ స్లూయిస్ పునర్నిర్మాణం చేపట్టకపోవటంతో ఉప్పునీరు పంట పొలాల్లోకి చేరకుండా తాత్కాలిక చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అధికారులను ఆదేశించగా, అవుట్ ఫాల్ గేట్ల వద్ద ఇసుక మూటలతో ఉప్పునీరు ఎగువకు రాకుండా అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్ల వద్ద అడ్డుగా వేశారు. వీటిని ఆక్వా రైతులు తొలగించారు. దీంతో యధావిధిగా మరలా ఉప్పునీరు ఎగువ నుంచి భారీగా ప్రవహిస్తుంది. ఫలితంగా 18, 15వ నంబర్ కాలువ కింద వందలాది ఎకరాల్లో వేసిన వరి నాట్లు ఉప్పునీట మునిగాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత ఇరిగేషన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావును వివరణ కోరగా, అవుట్ ఫాల్ స్లూయిస్ వద్ద గతంలో వేసిన ఇసుక మూటలను రైతులు తొలగించారని, మళ్లీ ఇసుక మూటలు వేయాలని కాంట్రాక్టర్‌కు చెప్పినట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నీట మునిగిన వరి పొలాలు

17న చెన్నైలో దక్షిణ భారత న్యాయవాదుల సదస్సు

నూతన క్రిమినల్ చట్టాలపై పోరాటం

విజయవాడ లీగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలై ఒకటి నుంచి అమలులోకి తెచ్చిన నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలని కోరుతూ నవంబరు 17వ తేదీ ఆదివారం చెన్నై నగరం, తెనియంపేట్‌లోని కామరాజర్ హాలులో తమిళనాడు, దక్షిణ భారత న్యాయవాదుల సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, అడ్వకేట్స్ జేఏసీ నేతలు వై.కోటేశ్వరరావు, నల్లూరి మాధవరావులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన 'భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్షా అధినియం' చట్టాలు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించే విధంగా వున్నాయన్నారు. న్యాయవ్యవస్థలో పోలీసు యంత్రాంగానికి యధేచ్ఛగా అధికారాలను కల్పిస్తూ, న్యాయవ్యవస్థకు వున్న అధికారాలను కుదిస్తూ, న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఈ చట్టాల అమలు ప్రజలకు నష్టదాయకం అని దేశవ్యాప్తంగా న్యాయవాదులు ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. వెంటనే నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ అధ్వర్యంలో దక్షిణ భారత దేశ న్యాయవాదుల సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్ణాటక, రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున న్యాయవాదులు పాల్గొనే సదస్సులో ఆంధ్రప్రదేశ్ నుంచి న్యాయవాదులు పెద్దసంఖ్యలో పాల్గొనవలసిందిగా సుంకర విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ..

బంటుమిల్లి : ఐషర్ వాహనం ఢీ కొట్టిన ఘటనలో గాయపడి విజయవాడలో చికిత్స పొందుతున్న బంటుమిల్లికి చెందిన యద్దనపూడి కృష్ణారావు(74) శుక్రవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బంటుమిల్లికి చెందిన కృష్ణారావు ఆర్తమూరు శివాలయంలో అర్చకుడిగా ఉన్నాడు. 10వ తేదీన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా కొర్లపాడువద్ద ఐషర్ వాహనం ఢీకొట్టింది. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.

ఉరేసుకున్న మహిళ మృతి

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. బంటుమిల్లి పెద తుమ్మిడికి చెందిన మేకా నరేష్, గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన గీతసంపూర్ణ(22)లకు ఐదేళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల బాబు, ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. నరేష్ తాగుడుకు బానిసై భార్యను కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఆమె ఈనెల 13 అర్ధరాత్రి ఇంటిలో ఉరివేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ గణేష్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

ప్రతి ఒక్కరిలోనూ సామాజిక బాధ్యత ఉండాలి

కంకిపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరిలోనూ సామాజిక బాధ్యత ఉండాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండలంలోని పునాదిపాడు గ్రామంలోని కమ్మవసతి గృహంలోని పేద విద్యార్థులకు శుక్రవారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. సుమారు లక్షల రూపాయల విలువైన దుస్తులు పంపిణీ చేసిన మండవ వెంకట నారాయణరావు, రూ. 25 వేలు విలువైన దుప్పట్లు ఆచంట బాలా మణిలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అనుమోలు జ్వాలా ప్రసాద్, పిడికిటి సుగుణ మూర్తి, యార్లగడ్డ రాజారాం, మద్దాలి సాయిబాబు, కాసరనేని కరుణ, అనుమోలు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కోటి దీపారాధన

విజయవాడ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశదీపం, రాత్రి 7 గంటలకు పంచహారతులు, ఉదయం నుంచి భక్తులు దీపారాధనలు అత్యంత కన్నుల పండుగగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ముఖ్యఅర్చకులు జీఆర్‌పీ సాగర్, పార్వతి రామలింగేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు అధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎస్.భవానీ పాల్గొన్నారు.



యనమలకుదురు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు



ప్రొద్దుటూరు శివాలయంలో..

ఓంకారేశ్వరస్వామి ఆలయంలో..

ఉయ్యూరు : కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని శివాల యాల్లో శుక్రవారం కోటీవత్తుల దీపారాధనలు వెలిగించారు. గండిగుంట బైపాస్ వద్ద అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఓంకారేశ్వరస్వామి ఆలయంలో మూడున్నర కోట్ల వత్తులు వెలి గించారు. ఉయ్యూరు శివాలయంలో ఉదయం, సాయంత్రం కార్తీకపౌర్ణమి దీపారాధనలు చేశారు. భక్తులు పెద్ద యెత్తున తరలివచ్చి దీపారాధన చేసి పూజలు చేశారు. ఓం కారేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడున్నర కోట్ల వత్తుల దీపారాధన కార్యక్రమానికి ఉయ్యూరు, గండిగుంట పరిసర గ్రామాల నుంచి మహిళలు, భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు మండవ జయదేవ్, ఉషారామకృష్ణ, బాబ్జి తదితరులు పాల్గొని సేవలందించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన చేశారు.

ప్రొద్దుటూరు శివాలయంలో

కంకిపాడు : కార్తీకపౌర్ణమి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ప్రొద్దుటూరు శివాలయంలో అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

బాపులపాడు మండలంలో..

హనుమాన్‌జంక్షన్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం బాపులపాడు మండలంలోని పలు ఆలయాల్లో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంక్షన్ నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు చాక్రవాధానుల సీతారామాచార్యులు హోమాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని బాబు, తవ్వా పూర్ణచంద్రరావు, ఈవో శ్రీనివాస్ పర్యవేక్షించారు. పెరికీడు ముక్తికాంత సమేత ముక్తేశ్వరాలయంలో ఆలయ కమిటీ సభ్యులు నందూరు సత్య వెంకటేశ్వరశర్మ, నక్కా బాబు, అర్చకులు శ్యామ్ జ్వాలాతోరణం వెలిగించారు. కొండేశ్వరస్వామి ఆలయంలో కూడా ఆలయ అర్చకులు మురళీశర్మ తోరణం వెల్లిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గండిగుంట ఓంకారేశ్వరస్వామి ఆలయంలో..



పాతపాడులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వీరభద్రస్వామి దంపతులు

వీరబ్రహేంద్రస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం

హాజరైన బ్రహ్మంగారి ఎనిమిదోతరం వారసులు

విజయవాడ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పాతపాడులోని వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు మహా కుంభాభిషేకం, శాంతికళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మంగారి ఎనిమిదోతరం మునిమనువడు వీరభద్రస్వామి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పండ్లు, నది జలాలతో అభిషేకించి ఆనంతరం యాగశాల ప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ ప్రముఖులు పాల్గొన్నారు.

పద్మనాభరెడ్డి మాటలు సిగ్గుచేటు

కంకిపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ పథకాలపై వైసీపీ నాయకుడు పద్మనాభరెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగ జయప్రకాష్ అన్నారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కూడా కావడం లేదన్నారు. అప్పుడే ప్రత్యేక హోదా, సూపర్ సిక్స్ పథకాలు, స్టీల్‌ప్లాంట్ అంటూ పద్మనాభరెడ్డి మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు పద్మనాభరెడ్డి ఏం చేశాడని ప్రశ్నించారు. కూతురు ఆయనను కాదని జనసేన పార్టీలో చేరిందని, పద్మనాభరెడ్డి ఇక ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కాపు సమాఖ్య జిల్లా అధ్యక్షులు పచ్చిపాల రాజా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జనజాతీయ గౌరవ్ దివస్ వేడుక

ఉయ్యూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జన జాతీయ గౌరవ్ దివస్ వేడుకల్లో భాగంగా ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ మాట్లాడుతూ గిరిజన స్వాతంత్ర సమరయోధుల గౌరవార్థం నవంబరు 15న జన జాతీయ గౌరవ్ దివస్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వేడుకలో భాగంగా భగవాన్ బిర్సా ముండా వంటి ధైర్య వంతులైన ఆదివాసీ నాయకుల స్వాతంత్ర పోరాటాన్ని వివరిస్తూ వ్యాసరచన, వక్తృత్త పోటీలు నిర్వహించామన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ పి. శ్రీరామ్‌తేజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గోపీచంద్, ఆర్‌వి శివరావు, గిరిప్రసాద్, ఎంఎల్ఎస్ కుమారి పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

288 మద్యం సీసాలు స్వాధీనం

గన్నవరం /హనుమాన్ జంక్షన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ సురేఖ అన్నారు. బాపులపాడు మండలం పాత మల్లవల్లిలో బెల్టుషాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 288 మద్యం సీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అల్లూరయ్య, పాండురంగబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రసాదంపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల మధ్య విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రసాదంపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని టీ.ఎం.ఎ.ఎస్ రోడ్డు, ఆంధ్రాబ్యాంకు పరిసర ప్రాంతాలు, పాల బజార్, కోళ్ల ఫారం బజార్, శక్తి కళ్యాణ మండపం రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.



నున్న గ్రామ నేతలను కలిసి కరపత్రాలు అందజేసిన ఎమ్మార్పీఎస్ నేతలు

మాదిగల ఆత్మీయ సదస్సు జయప్రదం చేయాలి

విజయవాడ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరంలో ఈ నెల 20న జరగనున్న మాదిగల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నేతలు శుక్రవారం రూరల్ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. పాతపాడు, అంబాపురం, నున్న గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమం లో ఎమార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా, మంద వెంకటేశ్వరరావు, మంద వేణు పాల్గొన్నారు.

అయ్యప్పలకు భిక్ష

ఉయ్యూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గరికపర్రు గౌడ రామాలయం వద్ద పీఠంలోని అయ్యప్పమాల ధరించిన 1500 మంది భక్తులకు సామాజిక సేవా తత్పరుడు, బీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బొమ్మారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నసమారాధన (భిక్ష) నిర్వహించారు. బీవీ ఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్, సెక్రటరీ సుబ్బారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సర్పంచ్‌కు 104 సిబ్బంది వినతి

గన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్నవారికి అత్యవసర సేవలు అందిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అసోసియేషన్ జిల్లా కోశాధికారి బి.సుబ్బారావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం సర్పంచ్ నిడమర్తి సౌజన్యకు వినతి పత్రాన్ని అందజేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉమా పాల్గొన్నారు.

గుంజే రాధాకృష్ణకు అవార్డు

కంకిపాడు : కంకిపాడుకు చెందిన గుంజే రాధాకృష్ణస్వామికి ఆసియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ సంయుక్తంగా శుక్రవారం నంది పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గుంజే రాధాకృష్ణ మాట్లాడుతూ, డాక్టర్ లయన్ ఆకుల రమేష్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని చెప్పారు. క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో వివిధ కారణాలతో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్న 12 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ పత్రాలను అందజేశారు. పట్టణానికి చెందిన సురేష్‌కు రూ.3.50లక్షలు, తేలప్రోలుకు చెందిన కంచికర్ల వినోద్‌కు రూ.1.45లక్షలు బాపులపాడుకు చెందిన వేపూరి డేవిడ్‌కు రూ.60వేలు, నిడమానూరుకు చెందిన వేములపల్లి రమేష్‌కు రూ.88వేలు, ఆత్కూరుకు చెందిన మస్తాన్‌వలీకి రూ.1.13లక్షలు, పెద అవుటపల్లికి చెందిన వెలమాటి నరేంద్రకు రూ.11.500, జలసూత్రం వెంకాయమ్మకు రూ.30వేలు, బుద్ధవ రానికి చెందిన వేల్పూరి రాజుకు రూ.75వేలు, గొప్పల రాజశేఖర్‌కు రూ.1.43లక్షలు, మడిచర్లకు చెందిన అరుణ కుమారికి రూ.2.5లక్షలు, చిలకపాటి శారదమ్మకు రూ.55వేలు, మల్లవల్లికి చెందిన షేక్ ప్యారికి రూ.25 వేలు సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలను అందజేశారు. టీడీపీ నాయకుడు యనమదల సతీష్ పాల్గొన్నారు.





గన్నవరంలో సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.. సీఎం సహాయనిధికి రూ. లక్ష చెక్కు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు అందజేస్తున్న దాతలు

సీఎం సహాయనిధికి రూ. లక్ష అందజేత

పెనమలూరు : సీఎం రిలీఫ్ ఫండ్‌కు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించేందుకు దాతలు ముందుకు రావడం హర్షణీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కేవీఎస్‌ఎం ఎస్టేట్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ. లక్షను శుక్రవారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, సీఎం రిలీఫ్ ఫండ్‌కు అవసరమైన ఆర్థికసాయాన్ని అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అదే విధంగా రావి వెంకటేశ్వరరావు అన్నాకాంట్యీన్‌కు రూ. 10 వేలు ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మేకా పాపారావు, రత్నగిరి రావు, ఎం. జనార్దనరావు, ఆర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖనం విజేతకు బహుమతి అందజేస్తున్న కానూరు బ్యాంకు మేనేజర్ ఎం. కృష్ణారావు తదితరులు

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో నేషనల్ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్

ఆటోనగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కానూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో నేషనల్ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2024ను జ్ఞానోదయ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. తొలుత ఉపాధ్యాయులు, విద్యార్థులతో బ్యాంకు సిబ్బంది పౌరుల సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఎమ్ కృష్ణారావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య

గన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ యువకుడు మృతి చెందిన సంఘటన ఉంగుటూరు మండలం పొట్టిపాడులో చోటు చేసుకుంది. ఆత్కూరు ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పొట్టిపాడుకు చెందిన బాణాల వెంకట వంశీకృష్ణ(38) మద్యానికి బానిసై అప్పులు చేసి ఆస్తి పంచమని వేధించటమే కాకుండా రోజూ తాగి వచ్చి అర్థరాత్రులు గొడవ చేస్తూ హింసిస్తున్నాడని తల్లి సుభాషిణి మూడు రోజుల క్రితం స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శుక్రవారం అతనిని పోలీసులు స్టేషన్‌కు పిలవడంతో అక్కడికి వచ్చిన వంశీకృష్ణ అవమానానికి గురై వెంట తెచ్చుకున్న పురుగుల మందును సేవించినట్లు చెబుతున్నారు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ..

హనుమాన్‌జంక్షన్ : మల్లవల్లి ఏపీ ఐఐసీ ప్రధా న మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒడిస్సాకు చెందిన కార్మికుడు కుషా కిషన్(40) విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మరో ఇరువురికి గాయాలయ్యాయి. వీరవల్లి ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10న మల్లవల్లి కామధేను ఫీడ్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మృతుడు కిషన్‌ను తనతో పాటు పనిచేసే దేవేంద్రసింగ్ ద్విచక్రవాహనం వెనుక ఎక్కించుకుని నూజివీడు-జంక్షన్ ప్రధాన రహదారికి వస్తుండగా వెనుక నుంచి మర్రిబంధం గ్రామానికి చెందిన పోతుశెట్టి శ్రీనివాసరావు ప్రమాదవశాత్తు బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కిషన్ విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విజయవాడ ప్రభుత్వాసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

బాపులపాడు మండలం వీరవల్లి రైల్వేస్టేషన్ పరిధిలో శుక్రవారం గుర్తుతెలియని రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని యువకుడు (20) మృతి చెందాడు. ఏలూరు జీఆర్పీ ఎస్సై సైమన్ తెలిపిన వివరాలు ప్రకారం.. తెలుపు రంగు చుక్కలతో కూడిన చొక్కా, నలుపు రంగు జీన్స్ ప్యాంట్, సపోటా రంగు షర్టు ధరించి ఉన్నాడని అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని చెప్పారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఎసై తెలిపారు. వివరాలు తెలిసినవారు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్..

గుండెపోటుకు గురై వట్లూరు గ్రామానికి చెందిన లారీ డ్రైవరు పిల్లి పాండురంగారావు (58) గురువారం రాత్రి లారీలోనే మరణించాడు. జంక్షన్ ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముసునూరు మండలం ముక్కొల్లుపాడు గ్రామంలో లారీలో ధాన్యం లోడింగ్ చేసుకొని వట్లూరుకు వస్తుండగా బాపులపాడు మండలం మడిచర్ల గ్రామం వద్దకు రాగానే గుండెపోటుకు గురయ్యాడు. లారీలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్థవంతమైన విద్యాబోధన చేయాలి

డీఈవో పీవీజే రామారావు

గన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అర్థవంతమైన విద్య బోధన చేయాలని డీఈవో పీవీజే రామారావు అన్నారు. మండలంలోని దావాజీగూడెం ఎంపీపీ పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి నైపుణ్యతను తెలుసుకున్నారు. పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా డీఈవో రామారావు మాట్లాడుతూ, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేదిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ఆత్కూరు జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈవోలు రవికుమార్, రామావత్ కమల, సాంబశివరావు, హెచ్ఎంలు జగదీశ్వరరావు, కుమారి, ఝాన్సీ, అజయ్, హరిసరన్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో పీవీజే రామారావు

నగలు అపహరణ కేసులో నిందితుడి అరెస్టు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : చోరీ జరిగిన రెండు రోజుల్లోనే నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద రూ3 లక్షలు విలువ చేసే 41 గ్రాములు బంగారు, 70గ్రాములు వెండి ఆభరణాలను స్వాధీనం చేసు కొని నూజివీడు కోర్టుకు రిమాండుకు పంపారు. సీఐ సత్యనారాయణ శుక్రవారం మీడియాకు వివరాలు తెలిపారు. ఈ నెల 12న కోడూరుపాడుకు చెందిన షేక్ షబ్బీర్ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి చొరబడి బీరువాలో ఉన్న 41 గ్రాములు బంగారు ఆభరణాలు, 70 గ్రాముల వెండి వస్తువులు అపహరించుకు పోయాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరవల్లి ఎస్సై ఎం. శ్రీనివాసరావు గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాలతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి మైలవరం మండలం సబ్జపాడు గ్రామానికి చెందిన పాత నేరస్తుడు విశ్వనాధపల్లి సుందరరావును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడు గతంలో కూడా తాళం వేసి ఉన్న ఇళ్లల్లోనే దొంగతనాలకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు.



వీరవల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

పుస్తక పఠనంతో మేధస్సు పెంపు

గన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతోనే మేధస్సు పెరుగుతుందని ఎంపీపీ అనగాని రవి అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు, చిమట రామారావు, దుర్గ లక్ష్మీ, రాజు, శంకర్ తదిత రులు పాల్గొన్నారు. పురుషోత్తపట్నంలో గ్రంథాలయ అధికారి కె.కృపానందం ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ● విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు పోటీలు దోహదపడతాయని మాజీ వైస్ ఎంపీపీ ఆర్నేపల్లి సింహాచలం అన్నారు. ఆత్కూరు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బీవి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యూరు:** గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని డీవైఈఓ ఐ.పద్మారాణి అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను పద్మారాణి ప్రారంభించారు. అనం తరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది విద్యా ర్థులకు ఆర్. వీరకుమారి ధరావతు చెల్లించి గ్రథాలయంలో సభ్యులుగా చేర్పించారు.

వనం..జనం

కొండపల్లి రిజర్వు ఫారెస్టులో వీరాంజనేయుడి చెంత వనభోజనాలు..కార్తీక పూజలు




దొంగమర్లబావి వద్ద వనభోజనాలు చేస్తున్న భక్తులు



ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు - త్రిలోచనాపురం అటవీ ప్రాంతంలో కొండపల్లి రిజర్వు ఫారెస్టులో (దొంగమర్ల బావి)లోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పచ్చని వనాల మధ్య అడవిలో ఉన్న ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి, కార్తీక దీపాలు వెలిగించారు. ఊటలు ఊరుతున్న వాగుల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. వందల సంఖ్యలో భక్తులు దొంగమర్ల బావి సందర్శనకు వెళ్లారు.

పర్యాటక కేంద్రంగా దొంగమర్ల బావి


వాగులు దాటుకుంటూ వెళ్తున్న పర్యాటకులు




నాగపుట్టకు పూజలు చేస్తున్న భక్తురాలు



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి నుంచి, ఇబ్రహీంపట్నం మూలపాడు బటర్‌ఫ్లై పార్క్ వైపు నుంచి 8 కిలో మీటర్ల దూరంలో కొండపల్లి రిజర్వు ఫారెస్టులోని దొంగమర్ల బావి పర్యాట కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇది మూలపాడు, కొండపల్లి, జుజ్జూరు, దుర్గిరాలపాడు ఫారెస్టు బీట్స్‌కు మధ్యలో ఉంటుంది. కార్తీక మాసంలో అధిక సంఖ్యలో పర్యాటకులు దొంగమర్ల బావి వద్దకు వెళుతుంటారు. ఒక దారి మూలపాడు మీదుగా ఉంటే మరో దారి జి.కొండూరు మండలం గడ్డమణుగులోయ మీదుగా ఉంది. వందల ఏళ్ల నాటి ఘాట్ రోడ్ల మీదుగా ఇక్కడకు చేరుకోవాల్సి ఉంటుంది. అత్యధికులు గడ్డమణుగు మీదుగానే వెళుతుంటారు. ఇటునుంచి ఊటలు ఉన్న మూడు వాగులు దాటి అందమైన వనాల మధ్య ఆహ్లాదంగా ఉంటుంది. గడ్డమణుగు లోయ నుంచి వెళ్లినా 8 కిలోమీటర్ల దూరం. కార్తీక మాసంలోనే కాక ప్రతి ఆదివారం దొంగమర్ల బావి వద్దకు పర్యాటకులు వెళుతుంటారు. అక్కడున్న వీరాంజనేయ స్వామి కోరిన కోర్కెలు తీరుస్తాడని భక్తుల విశ్వాసం. సరైన దారి సౌకర్యం లేకపోవడంతో అతి కష్టం మీద అక్కడకు చేరుకుంటున్నారు. ఆహ్లాదకరమైన వాతావ రణం మధ్య గడపడంతో వెళ్లేందుకు పడిన ఇబ్బందులన్నీ మర్చిపోతుంటారు.

దొంగమర్ల బావి అని ఎందుకంటారంటే..

బ్రిటీష్ కాలంలో దోపిడీ దొంగలు చుట్టు పక్కల గ్రామాల్లో దోపిడీలకు పాల్పడి, వారు దోచుకున్న సొమ్మును అక్కడకు వెళ్లి అక్కడున్న బావిలో తాగి, వాటాలు పంచుకుని రోజంతా అక్కడగడిపే వారు. అందుకనే ఆ బావికి దొంగమర్ల బావి అని పేరు వచ్చింది. ప్రస్తుతం ఆబావి పాడుపడి ఉంది.


'బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష' పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

68 లక్షల మంది విద్యార్థులకు

ఉచిత వైద్యపరీక్షలు

- బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష ప్రారంభంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్

మొగల్రాజపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమం ద్వారా 18 ఏళ్ల లోపు పిల్లల్లో 44 ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి పరీక్షలు చేసి, ఉచిత చికిత్స అందిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు, పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 68 లక్షల మంది విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. చిన్నతనంలోనే పిల్లల్లో వ్యాధులు, లోపాలను గుర్తించి సత్వర చికిత్స అందించి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం.' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. పటమట కోనేరు బసవయ్యచౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ద్వారా 639 భవిత సెంటర్ల ద్వారా పిల్లల్లో గ్రహణమొర్రి, కంటి, గుండె సంబంధిత వ్యాధులను గుర్తించి చికిత్స అందిస్తామని మంత్రి తెలిపారు. బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమంపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, పాఠశాల విద్యా డైరెక్టర్ వి.విజయ్‌రామరాజు, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వాకాటి కరుణ, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బియ్యంతో పౌరసరఫరాల అధికారులు

268 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

మొగల్రాజపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓ పాడుబడిన గోదాములో రేషన్ బియ్యం భారీ డంప్‌ను గురువారం రాత్రి పౌరసరఫరాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్టేట్ 2వ రోడ్డులో కొందరు గొడవ పడుతున్నారని, పటమట పోలీసులకు సమాచారం వచ్చింది. సిబ్బందితో ఎస్‌ఐ రేవతి అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసి గొడవ పడుతున్న వారు పరారయ్యారు. అక్కడ పరిశీలిస్తే గోదాములో బియ్యం బస్తాలు కనిపించాయి. వెంటనే డీఎస్వో పాపారావుకు ఆమె సమాచారం ఇచ్చారు. డీఎస్వో తన సిబ్బందితో వచ్చి పరిశీలిస్తే 26,890 కిలోల బియ్యం(268 క్వింటాళ్లు) తెల్ల సంచుల్లో ప్యాకింగ్ చేసి రవాణాకు సిద్ధంగా ఉన్నాయి. గోత్రపు రమేష్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు గుర్తించారు. అతనిపై 6ఏ కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కొండపల్లిలో ఉన్న బీఎస్ ఆగ్రోస్ రైస్ మిల్లులో భద్రపరిచారు.

ఖజానాకు భారంగా మారారని

ఏడుగురు అదనపు పీపీల తొలగింపు

విజయవాడ లీగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ నాగరిక సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్) చట్టం అమల్లోకి రావడంతో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులు మనుగడలో లేవు. దీంతో అందులో పని చేస్తున్న కృష్ణాజిల్లాకు చెందిన ఏడుగురు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్రభుత్వ ఖజానాకు భారంగా మారారని, వారిని తొలగిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. వీరితో పాటు తిరుపతిలో ఎర్రచందనం కేసులను చూసే స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను కూడా తొలగిస్తూ ఆయన ఆదేశాలు జారీ చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసే మురాల లక్ష్మీ వెంకటేష్‌బాబు, విజయవాడలోని 5వ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పీపీ చామర్తి శ్రీరామచంద్రమూర్తి, విజయవాడలోని 4వ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పీపీ సంకా పరమేశ్వరరావు, విజయవాడలోని 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అదనపు పీపీ జి.మాలతి, గుడివాడలోని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పీపీ నీలం బెంజిమన్, నూజివీడులోని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పీపీ జంగం దేవదాస్ గాంధీ, అవనిగడ్డలోని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పీపీ చిట్టిప్రోలు వెంకట కృష్ణప్రసాద్, తిరుపతిలోని ఎర్రచందనం కేసులను చూసే స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.నగేష్‌ను తొలగిస్తూ డీవోపీ ఆదేశాలు జారీ చేశారు.


గిరిప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఈవో రామారావు దంపతులు

వైభవంగా గిరి ప్రదక్షిణ

వన్‌టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరి ప్రదక్షిణ ఆద్యంతం భక్తి పారవశ్యంతో వైభవంగా సాగింది. మహిళా భక్తుల లలితా సహస్రనామ పారాయణం, జై దుర్గ, జైజై దుర్గ నినాదాలు, మంగళవాయిద్యాలు, జయజయ ధ్వానాల మధ్య 8 కిలోమీటర్ల పొడవునా గిరి ప్రదక్షిణ కొనసాగింది. మార్గం మధ్యలో భక్తులు పసుపు జలాల వారు పోసి, టెంకాయలు కొట్టి, పూలు, పండ్లు, హారతులు సమర్పించారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద ఉత్సవమూర్తులకు లఘుపూజ చేశాక, ఈవో రామారావు దంపతులు, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి కొబ్బరికాయల బలిహరణలు ఇచ్చారు. ఉత్సవమూర్తులు కొలువైన ప్రత్యేక వాహనాన్ని ఈవో దంపతులు, ముఖ్య అర్చకులు భక్తులు లాగారు. కార్తీక పౌర్ణమి, శుక్రవారం దృష్ట్యా లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గగుడిలో అన్నవితరణ నిమిత్తం శుక్రవారం గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన దామినేని హర్ష, విజయవాడ మాచవరం ప్రాంతంలోని గులాం మొహీద్దీన్‌నగర్‌కు చెందిన అవాల సూర్యారావు, ఆయన కుటుంబ సభ్యులు రూ.లక్ష చొప్పున విరాళం ఇచ్చారు. దుర్గమ్మను మహిళా ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కొల్లా లలితకుమారి దర్శించుకున్నారు.

విద్యారంగ సమస్యలు

పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్

ధర్నాచౌక్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహాసభ హనుమాన్‌పేటలోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలని, నిత్యావసర ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ మెస్‌బిల్లులు పెంచాలని, కాస్మోటిక్, మెస్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కె.శివారెడ్డి, దోనేపూడి శంకర్, జి. కోటేశ్వరరావు, రావుల రవీంద్రనాథ్, పరుచూరి రాజేంద్ర, లంకా గోవింద్, సాయికుమార్ పాల్గొన్నారు.

బాలోత్సవం ప్రారంభం

మొగల్రాజపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో అమరావతి బాలోత్సవం 7వ పిల్లల పండుగ మూడు రోజుల కార్యక్రమాన్ని శుక్రవారం బాలోత్సవ్ గౌరవాధ్యక్షుడు ప్రముఖ విద్యావేత్త, పారిశ్రామికవేత్త చలువాది మల్లికార్జునరావు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు పాల్గొన్నారు. మొదటి రోజు కార్టూన్, పోస్టర్ ప్రజంటేషన్, వ్యాసరచన (ఇంగ్లీషు, తెలుగు), మట్టిబొమ్మల తయారీ, తెలుగు డిక్టేషన్, అంతర్జాలంలో అన్వేషణ, కవితా రచనా, స్పెల్ బీ, ఉత్తరం రాయడం, జానపదనృత్యం, ఫాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ; క్లాసికల్ డాన్సు, లఘు నాటిక, దేశభక్తి గీతం వంటి అంశాల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. 20 వేదికలపైన 60 అంశాల్లో 200 పాఠశాలలకు చెందిన 12వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారని బాలోత్సవ్ అధ్యక్షుడు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రామారావు కార్యదర్శి కొండలరావు తెలిపారు. ఎస్‌బీఐ డీజీఎం మనీష్ కుమార్‌సింగ్, క్రెడాయ్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, విదార్థులు, పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నాయి.


మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు

వ్యవసాయ పనిముట్లకు నష్టపరిహారం ఇవ్వాలి

- మంత్రి అచ్చెన్నాయుడుకు కౌలు రైతుల సంఘం వినతి

గవర్నర్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది, బుడమేరు వరదల కారణంగా పాడైపోయిన వ్యవసాయ పనిముట్లకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నేతలు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడిని కోరారు. శుక్రవారం ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి పంచకర్ల రంగారావు తదితరులు సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. పాడైన మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, ఇతర వ్యవసాయ పరికరాలను ఎన్యూమరేషన్ చేసి, మరమ్మతులు చేసుకునేందుకు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పంట పొలాలను వ్యవసాయానికి అనుకూలంగా తీసుకురావడానికి, మేటలు వేసిన ఇసుక, మట్టిని తొలగించుకునేందుకు కౌలురైతులకు వరికి ఎకరానికి రూ. 25 వేలు, పసుపు, కంది వాణిజ్య పంటలకు పెట్టుబడి మేరకు రూ.60 వేల నుంచి రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని పేర్కొన్నారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఉమ్మడి కృష్ణా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్త్రీ, పురుష జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. స్త్రీలు 75 కిలోల లోపు, పురుషులు 85 కేజీల లోపు ఉండాలని, క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డులతో ఎంపిక చేసే ప్రాంగణానికి హాజరు కావాలని ఆయన సూచించారు. వివరాలకు 97040 63555 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వరల్డ్ రికార్డు కోసం జానపద నృత్యం నేడు

గవర్నర్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, ఏషియన్ వరల్డ్ రికార్డు సంస్థల సమక్షంలో శనివారం విజయవాడలోని సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో విద్యార్థులు జానపద నృత్యం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 400 మంది విద్యార్థులు భారతదేశపటం ఆకారంలో 28 రాష్ట్రాలకు సంబంధించిన సంప్రదాయ జానపద నృత్యాలు చేసి వరల్డ్ రికార్డును సాధించేందుకు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, రాజ్‌భవన్ జాయింట్ సెక్రటరీ జె.సూర్యప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

ఎంఆర్ఐ మిషన్లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సర్వజనాసుపత్రిలో ఎట్టకేలకు ఎంఆర్ఐ మిషన్లు పని చేయడం ప్రారంభించాయి. 'మొరాయిస్తున్న ఎంఆర్ఐ యంత్రాలు' పేరుతో ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించారు. ఎంఆర్ఐ మిషన్లకు మరమ్మతులు చేయించారు. దీంతో అవి పని చేయడం ప్రారంభించాయి. రోగుల ఇబ్బందులు తొలగిపోయాయి.


జీవన మంజూష పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

గ్రంథాలయ వ్యవస్థలో సమూల మార్పులు తెస్తా

- గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

విజయవాడ కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి, మూడు నెలల్లో గాడిన పెడతానని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నవమల్లెతీగ మాసపత్రిక-క్రామేడ్ జీఆర్‌కే-పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మంజు యనమదల రచించిన 'జీవన మంజూష' వ్యాస సంపుటిని గోనుగుంట్ల ఆవిష్కరించారు. సమాజాన్ని చదివిన రచయితల రచనలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయని మంజు యనమదల రాసిన ఈ పుస్తకంలోని వ్యాసాలన్నీ ఆ కోవకు చెందినవేనని సభకు అధ్యక్షత వహించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ తెలిపారు. రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

26న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు

- రైతులు, కార్మికులు జయప్రదం చేయాలి
- వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపు

ధర్నాచౌక్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 26న జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న రైతు, కార్మిక ప్రదర్శనలు, సభలు, ధర్నాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 'డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ 2' పథకం ద్వారా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌పరం చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, రైతు నేత కేశవరావు, రైతుకూలీ సంఘం అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ, పి.జమలయ్య పాల్గొన్నారు.

నగరంలో దేవకీనందన వాసుదేవ సందడి

పటమట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నటుడు మహేష్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటించిన దేవకీనందన వాసుదేవ చిత్ర యూనిట్ ప్రమోషన్స్‌లో భాగంగా నగరంలో సందడి చేసింది. ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించింది. హను మాన్ చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ అందించిన కథతో దర్శకుడు అర్జున్ జంధ్యాల నిర్మించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని అశోక్ గల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన టీజర్, పాటలకు విశేషమైన ఆదరణ లభిస్తోందన్నారు. హీరోయిన్‌గా మానస వారణాసిని పరిచయం చేస్తున్నామని, ఆమె నటన ఆకట్టుకుందని తెలిపారు. ఈ చిత్రంలో తన మేనమామ మహేష్‌బాబు కృష్ణుడి పాత్రలో నటించాడని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని అశోక్ గల్లా తెలిపారు. నిర్మాత బాలకృష్ణ సోమినేని పాల్గొన్నారు.


హీరోయిన్ మానస వారణాసి, హీరో అశోక్ గల్లా



జంక్షన్‌లో డ్రింకర్ సాయి సినిమా టీజర్ విడుదల వేడుకలో మాట్లాడుతున్న ధర్మమహేష్

డ్రింకర్ సాయి టీజర్ విడుదల

హనుమాన్‌జంక్షన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జంక్షన్ కేఎస్ టాకీస్ అధినేత కాకాని వెంకటేశ్వరరావు(బాబు), అరుణ దంపతుల కుమారుడు కాకాని ధర్మమహేష్ హీరోగా నటించిన రెండో సినిమా డ్రింకర్ సాయి టీజర్‌ను కేఎస్ టాకీస్‌లో శుక్రవారం విడుదల చేశారు. తన తల్లిదండ్రులు, యూనిట్‌సభ్యులు, నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి వేంకటేశ్వర స్వామి దేవస్థానం, అభయాంజనేయస్వామి దేవస్థానంలో ధర్మమహేష్ పూజలుచేశారు. అనంతరం అభిమానులు థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. హీరోయిన్ ఐశ్వర్య శర్మ, నిర్మాతలు బసవరాజు శ్రీనివాస్, బసవరాజు లహరేదర్, షేక్ ఇస్మాయిల్, దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి, బిగ్‌బాస్ సెలబ్రిటీ సీత, అంబర్‌పేట శంకర్, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ ప్రపంచ పోటీల్లో

వరప్రసాద్‌కు రజతం

రైల్వేస్టేషన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బ్యాంకాక్‌లో ఈనెల 9, 10 తేదీల్లో యునైటెడ్ వరల్డ్ స్పోర్ట్స్, ఫిట్‌నెస్, ఫిట్‌నెస్ చాంపియన్‌షిప్ ఫెడరేషన్లు నిర్వహించిన శరీర సౌష్టవ పోటీల్లో విజయవాడ రైల్వే ఆఫీసర్ల క్లబ్ జిమ్ హెల్పర్ తుమ్మల వరప్రసాద్ రజత పతకం గెలుచుకున్నారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, ఏడీఆర్ఎం పి.ఎడ్విన్ శుక్రవారం వరప్రసాద్‌ను అభినందించారు. వరప్రసాద్ ఇప్పటికే రాష్ట్ర, జాతీయస్థాయిల్లో అనేక పతకాలు పొందారు. ఇటీవల 50 ప్లస్ మిస్టర్ ఆంధ్రా పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. వరప్రసాద్‌ను సీనియర్ డీపీవో కట్టా ఆనంద్, పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సహ ఉద్యోగులు, రైల్వే అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.


వరప్రసాద్‌ను అభినందిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.550

పామర్రు కాంగ్రెస్ కో-ఆర్డినేటర్‌గా మొవ్వా

పామర్రు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పామర్రు నియోజకవర్గ కాంగ్రెస్ కో- ఆర్డినేటర్‌గా తోట్లవల్లూరు మాజీ ఎంపీపీ మొవ్వా మోహనరావు నియమితులయ్యారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలోని అందరితో సత్సంబంధాలు ఉన్న మోహనరావుకు సౌమ్యుడిగా మంచి పేరు ఉంది. తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన పదవికి వన్నె తెచ్చేవిధంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మొవ్వా మోహనరావు తెలిపారు. అధికార పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్ని చైతన్య వంతుల్ని చేస్తానన్నారు. మోహనరావు నియామకం పట్ల కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు.



కూచిపూడి బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో..



గుడివాడలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పామర్రు శివాలయంలో..

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కూచిపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలంకరణ నిర్వహించారు. జ్వాలా తోరణం కార్యక్రమం జరిగింది. చినముత్తేవి, కూచిపూడి, పెదపూడి, అయ్యంకి, యద్దనపూడి, నిడుమోలు, కాజ, కోసూరు, మొవ్వపాలెం దేవాలయాల్లో అలంకరణ, అభిషేకాలు నిర్వహించారు.

గుడివాడ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, పట్టణంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉసిరిచెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలను వెలిగించి దీపోత్సవం చేశారు. శివపార్వతులకు అభిషేకాలు చేశారు. శైవక్షేత్రాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా దేవస్థాన సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

పామర్రు : కార్తీక పౌర్ణమి వేడుకలు పామర్రు శివాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. మహిళలు పుల్లేటి కాల్వలో స్నానాలాచరించి ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద, ఉసిరి వృక్షాల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకులు లంక భీష్మా, బేతనబొట్ల పవన్, ఫణి ఆధ్వర్యంలో మహాశివునికి బిల్వార్చన, విశేష అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి నాడు శివాలయంలో దీపారాధన చేయడం వల్ల సకల దోషాలు తొలగడంతోపాటు, ముక్కోటి దేవతల అనుగ్రహం సిద్ధిస్తుందని పండితులు పేర్కొన్నారు. ఆలయాధికారి ఎన్‌వి రెడ్డి భక్తులకు ఏర్పాట్లు చేశారు. రాపర్ల, కొండిపర్రు, ప్రాకెర్ల, పెదమద్దాలి, కురుమద్దాలి, ఎల్లకుర్రు, నిమ్మకూరు, కనుమూరు దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.





గుడ్లవల్లేరు సిద్దేశ్వరాలయం వద్ద జ్వాలా దీపం.. దోకిపర్రు వేంకటేశ్వరుని సన్నిధిలో కోటిదీపోత్సవం

గుడ్లవల్లేరు: కార్తీక పౌర్ణమి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. వేమవరం కొండాలమ్మ ఆలయంలో చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. గుడ్లవల్లేరు గంగా పార్వతీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం జ్వాలా దీపం వెలిగించి భక్తులు దీపార్చనలు నిర్వహించారు. వడ్లమన్నాడు ద్రోణేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు.

●కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో సముద్ర స్నానాలకు వచ్చిన భక్తులకు వేమవరం కొండాలమ్మ దేవస్థానం ద్వారా 100 కేజీల పులిహోర ప్రసాదం పంపిణీ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. జనసేన నేత బండి రామకృష్ణ తదితరులు ప్రసాదం పంపిణీలో పాల్గొన్నారు.

దోకిపర్రులో కోటి దీపోత్సవం

దోకిపరు శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కారించుకొని కోటి దీపోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీవీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల పర్యవేక్షణలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దీపార్చన చేశారు. సుధారెడి, పి.వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు, సుమలత, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



ధరలు తగ్గించాలని కోరుతూ కార్మిక సంఘం నిరసన

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

గుడివాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కొమ్ముల సురేష్ డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ గుడివాడలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పనులు లేక కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇ.కుమార్, కె.వి రామస్వామి, సి.హెచ్ ఉదయ్‌కుమార్, జి.శేఖర్, బి.చంటి, కె.గోపి, సి.హెచ్ నాగేంద్ర, టి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

మల్లాయిపాలెం టిడ్కో కాలనీ ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని వామపక్ష నాయకులు ఆర్‌సిపి రెడ్డి, చింతలూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సుందరయ్యభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. టిడ్కో కాలనీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, తాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. మౌలిక వసతులను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు.

వీకేఆర్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



నియామకపత్రాలను అందుకున్న విద్యార్థులు

బెంగళూరుకు చెందిన టెస్ట్ యంత్రా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అనుబంధ సంస్థ క్యూ స్పైడర్స్ శుక్రవారం వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులు ఎలక్ట్రానిక్స్ నుంచి ఐదుగురు, కంప్యూటర్స్ నుంచి 25 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి నియామకపత్రాలను అందజేశారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌హెచ్.వి ప్రసాదరావు, ఎస్.నవీన్, ఎన్.ధనుంజయరావు, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

రెండు బెల్టు షాపులపై దాడి

గుడివాడ, నవంబరు15(ఆంధ్రజ్యోతి) : గుడివాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. గుడ్లవల్లేరుకు చెందిన వెలగపల్లి నానిబాబు వద్ద 8మద్యం సీసాలు, గుడివాడ పట్టణానికి చెందిన వెన్న రాజేష్ వద్ద 10మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ పి.వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్.ఐ పి.హేమ సుస్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో సన్నరకాల ఆవశ్యకత

- నూతన వరి వంగడాల రూపకల్పనకు పరిశోధనలు
- లాం పరిశోధనా సంచాలకులు

డాక్టర్ పి.వి.సత్యనారాయణ

కూచిపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరిలో సన్నరకాల ఆవశ్యకత పెరిగిందని, నూతన వరి వంగడాల రూపకల్పనకు విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని గుంటూరు లామ్ ఫామ్ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ పేర్కొన్నారు. మొవ్వ గ్రామానికి చెందిన మండవ కోటేశ్వరరావు సాగు చేసిన ఆర్‌జీఎల్ 7034, 7039 వరి పంటను శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించింది. కృష్ణాడెల్టాలో ఈ ఏడాది 13 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేసినట్లు సత్యనారాయణ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట పడిపోకుండా ఉండేందుకు, దోమ పోటు తట్టుకునే విధంగానూ 150 రోజుల కాల పరిమితిలో వరి కోతకు వచ్చే వంగడాలు, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించే నూతన వరి వంగడాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. మరిన్ని రకాలు రైతులకు అందుబాటులోకి తెచ్చే విధంగా పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. మొవ్వ గ్రామంలో మండవ కోటేశ్వరరావు సాగు చేసిన ఆర్‌జీఎల్ 7034, 7039 రకం ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని ఆశాజనకంగా నిలిచిందని తెలిపారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డా.డి.సుధారాణి, శాస్త్రవేత్తలు బి.నవీన్, డా.వెంకటలక్ష్మి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



మొవ్వలో సాగు చేసిన నూతన వరి వంగడాలు పరిశీలిస్తున్న పి.వి.సత్యనారాయణ, శాస్త్రవేత్తలు

పెదపారుపూడిలో..

పెదపారుపూడిలోని రైతు మేడికొండ నాగులు ప్రకృతి సాగు ద్వారా ఎంటీయూ 1318, రసాయన సాగు ద్వారా చేస్తున్న ఎంటీయూ 1318 పొలాలను శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో అధిక ఆదాయం సాధించవచ్చునని ఆచార్య ఎన్.జి.రంగా యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పి.వి.సత్యనారాయణ తెలిపారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌సుధారాణి, డాక్టర్ నవీన్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారథి, ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, ఏవో త్రినాథ ఆంజనేయులు, జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయం సిబ్బంది, గుడివాడ డివిజన్ యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



పామర్రులో జరిగిన వనసమారాధనలో ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా

ఐకమత్యానికి వనసమారాధనలు దోహదం

పామర్రు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక వనసమారాధనలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందింప చేస్తాయని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పట్టణంలోని శ్రీవేణుగోపాల బాలభక్త చెక్క భజన సమాజం ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్తీక దామోదరునికి, వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ వైసీపీ ప్రజాప్రతినిధులతో కలిసి కార్తీక వన సమారాధనకు హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెలే వర్లకుమార్‌రాజా, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌లను దుశ్శాలువాలతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. గ్రామ ఉపసర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ టీడీపీ, జనసేన నేతలు వల్లూరిపల్లి గణేష్, తాడిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ చారిటబుల్ ఆధ్వర్యంలో అయ్యప్పలకు అన్నదానం

తోట్లవల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గరికపర్రులో శుక్రవారం భజన కార్యక్రమానికి వచ్చిన అయ్యప్పస్వాములకు బీవీఆర్ చారిటబుల్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకటరెడ్డి రూ.45 వేలతో అన్నదానం ఏర్పాటు చేసినట్లు బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్ తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో తెలుగు తమ్ముళ్లు

రావికి తెలుగు తమ్ముళ్ల అభినందన

నందివాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుకు నందివాడ మండల టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. యలమంచిలి సతీష్, నంబూరి రాకేష్, సుధాకర్, శ్రీనివాసరావు, రత్నప్రసాద్, అర్జున రావు, మురళీ, చంద్రశేఖర్, అర్జునరావు, అరిపిరాల టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు చింతా కమలయ్య, సొల్మాన్, నాగబాబు, కుదరవల్లి మాజీ సర్పంచ్ మనిముక్కు వేణు, దుర్గ అభినందనలు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



మాట్లాడుతున్న పుష్పరాణి

గుడివాడ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులకు, సచివాలయ సిబ్బంది, వెలుగు వీవోలకు శిక్షణ నిర్వహించారు. ఎంపీపీ గద్దె పుష్పరాణి అధ్యక్షతన నిర్వహించారు. పంచాయతీలకు ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంటుతో ఏయే పనులు చేయాలి, ఎలా ఖర్చు చేసుకోవాలనే అంశంపై చర్చించి ప్రణాళికలు రూపొందించుకోవటమే శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఎంపీడీవో వై.వి.విష్ణు ప్రసాద్, పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాసరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏపీఎం ప్రసాద్ కుమార్, వెలుగు వీవోలు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

కూచిపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మొవ్వ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అవిరిపూడిలో అక్రమ మద్యం అమ్ముతున్న శిఖా నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బి.వరాలరాజు తెలిపారు. అక్రమ మద్యం కేసుల్లో మూడు సార్లు కేసు నమోదైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ లక్ష్మీకాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పెంజంద్రలో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాల నమోదులో బొప్పన శివప్రసాద్

గుడ్లవల్లేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు మండలంలో టీడీపీ సభ్యత్వాల నమోదు ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటి వరకూ 6500 మంది సభ్యత్వం పొందారని మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి తెలిపారు. పెంజంద్ర గ్రామంలో శుక్రవారం 450 సభ్యత్వాలు నమోదయ్యాయని గ్రామ పార్టీ అధ్యక్షుడు బొప్పన శివప్రసాద్ చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తోట్లవల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ లైన్‌ల మరమ్మతులు దృష్ట్యా శనివారం తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, బొడ్డపాడు, చినపులిపాక గ్రామాల రైతులకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దేవదాసు శుక్రవారం తెలిపారు. రైతులు సహకరించాల్సిందిగా కోరారు.

పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలో అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ మచిలీపట్నం డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కూచిపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సబ్బినేని సాంబశివరావు పేర్కొన్నారు. మొవ్వ శాఖ గ్రంథాలయం గ్రంథాలయ వారోత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి కృష్ణకుమారి పర్యవేక్షించారు.

పమిడిముక్కల : గ్రంథాలయాలను ఉపయోగించుకుని పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవాలని ఉయ్యూరు డీవైఈవో ఐ.పద్మారాణి అన్నారు. పమిడిముక్కల శాఖ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శనను డీవైఈవో ప్రారంభించారు. గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగులు కంచర్ల దుర్గారావు, అద్దేపల్లి ఏసోబు, గ్రంథాలయ అధికారి సాలర్ షరీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడివాడ : షాగులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం రాజేంద్రనగర్ గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు పుస్తకపఠనం నిర్వహించారు. అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారులు బీరం వెంకటరమణ, పి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.వి.నరసింహారావు, ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, డాక్టర్ హెచ్.జయంత్ విచ్చేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పుస్తక పఠనం చేయాలని సూచించారు. గ్రంథాలయాధికారిణి ఎంవిఎస్.లక్ష్మీ, గ్రామస్థులు కె.రమణ, బాబురావు, సురేష్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. యలమర్రు, వెంట్రప్రగడ గ్రంథాలయాల్లో కూడా పుస్తక ప్రదర్శన నిర్వహించారు.



పెదపారుపూడిలో పుస్తక ప్రదర్శన

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక పఠనను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని గ్రంథాలయాధికారి బాబూరావు కోరారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.550

కనీస మర్యాద ఇవ్వడం లేదు : టీడీపీ నాయకుల ఆవేదన

అవనిగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి గెలుపు కోసం కృషి చేసిన తమకు కనీస మర్యాద, గుర్తింపు దక్కటం లేదని టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాస రావు నేతృత్వంలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆరు మండలాల నాయకులు మాట్లాడుతూ వైసీపీ అరాచకాలను ఎదుర్కొని పార్టీకి కొమ్ము కాసిన బూత్ లెవల్ కార్యకర్తలు, గ్రామ స్థాయి నేతలు, మండల నేతలను ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. నియోజకవర్గంలో సీసీ రహదారుల పనులను వైసీపీ నేతలు, సానుభూతిపరులే చేస్తున్నారన్నారు. మండల స్థాయి నేతలకే కనీస మర్యాద లేకపోతే సామాన్య కార్యకర్తకు ఏం భరోసా ఇవ్వగలమని ప్రశ్నించారు. కనపర్తి శ్రీనివాసరావు స్పందిస్తూ ఈ విషయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా సహకార అధికారి చంద్రశేఖర్ రెడ్డి

సమష్టి కృషితోనే సహకార సంఘాల అభివృద్ధి

● జిల్లా సహకార అధికారి చంద్రశేఖర్ రెడ్డి

చల్లపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమిష్టి కృషితోనే వక్కలగడ్డ సహకార సంఘానికి గుర్తింపు లభించిందని జిల్లా సహకార అధికారి కె.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. వక్కలగడ్డ సొసైటీ ఆవరణలో సహకార వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సహకార సంఘం కుటుంబ వ్యవస్థ లాంటిదన్నారు. కుటుంబ సభ్యులంతా చర్చించుకున్నట్లుగా సంఘ సభ్యులంతా ఒకచోట చేరి చర్చించుకునేందుకు సహకార వారోత్సవాలు దోహదపడతాయన్నారు. సహకార అధికారి వి.వి.ఫణికుమార్ మాట్లాడుతూ, సహకార సంఘాలు అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షతన జరిగిన సభలో సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి డి.నాగమల్లేశ్వరరావు, చల్లపల్లి కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ వై.నాగరాజకుమారి, సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి కె.వినయ్ కుమార్, జోనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె.భోజ రంగరాజు ప్రసంగించారు. తొలుత సహకార అధికారి చంద్రశేఖర్‌రెడ్డి సహకార పతాకాన్ని ఆవిష్కరించారు.



ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును మర్యాదపూర్వకంగా కలిసిన ముడా చైర్మన్ మట్టా ప్రసాద్

ముడా కార్యక్రమాలకు సహకరించండి

●ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లను కోరిన ముడా చైర్మన్

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బందరు పోర్టు నిర్మాణం జరుగుతున్న దృష్ట్యా పోర్టు అనుబంధ పరిశ్రమలు ఏర్పడేందుకు, ముడా కార్యక్రమాలు విస్తృతపరిచేందుకు సహకరించాలని ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ కోరారు. కొనకళ్ల నారాయణరావును శుక్రవారం రాత్రి ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు అండగా ఉండి మచిలీపట్నం అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. టీడీపీ నాయకులు బత్తిన దాసు, ఫణికుమార్, సీతారామయ్య, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

సభ్యతను వైసీపీ వద్ద నేర్చుకోవాల్సిన దుస్థిలో లేము

● మాజీ ఎమ్మెల్యే సింహాద్రి వ్యాఖ్యలపై కనపర్తి ఆగ్రహం

అవనిగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సభ్యత, సంస్కారాలను వైసీపీ నేతల వద్ద నేర్చుకోవాల్సిన దుస్థితి టీడీపీకి లేదని నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీపైన, కూటమి సర్కార్‌పైన, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌పైన, తనపైన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేసిన వ్యాఖ్యలను శుక్రవారం విలేకరుల సమావేశంలో కనపర్తి శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. దవడ పగలకొడతామంటూ హెచ్చరికలు చేస్తున్న సింహాద్రి రమేష్‌బాబు మూడు సార్లు నియోజకవర్గ ప్రజల చేతిలో దవడ పగులకొట్టించుకుని ఇంట్లో కూర్చున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వైసీపీ వారిలాగా అరాచకాలు ప్రోత్సహించే సంస్కృతి తమది కాదని కనపర్తి అన్నారు. ఇప్పటికైనా సింహాద్రి రమేష్‌బాబు బుద్ధి తెచ్చుకుని ప్రవర్తించాలని హితవు పలికారు. నియోజకవర్గాన్ని దోచుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అవసరం టీడీపీకి ఎంత మాత్రం లేదని టీడీపీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ అన్నారు.



కాపు మహానాడు కార్తీక వనసమారాధన కార్యక్రమానికి భూమిపూజ చేస్తున్న జనసేన నేత కొట్టె వెంకట్రావు, బండి రామకృష్ణ

కాపు మహానాడు కార్తీక సమారాధన 24న

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 24న మేకావారిపాలెం గ్రామంలో కాపు మహానాడు కార్తీక వనసమారాధన జరుగుతుందని మాజీ కౌన్సిలర్, జనసేన నాయకుడు కొట్టె వెంకట్రావు తెలిపారు. కాపుమహానాడు వనసమారాధన కార్యక్రమానికి శుక్రవారం భూమి పూజ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర, టీడీపీ నాయకుడు వాలిశెట్టి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చోడవరం గ్రామస్థులు

ప్రయాణికుల విశ్రాంతి భవనానికి స్థలం కేటాయించాలి

మోపిదేవి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చోడవరంలో బస్ షెల్టర్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ శుక్రవారం గ్రామస్థులు తహసీల్దార్ ఎం.హరనాథ్ బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయాన్ని మాజీ రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా, సానుకూలంగా స్పందించి రూ.5 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కావున ప్రయాణీకుల పరిస్థితిని అర్థం చేసుకుని గ్రామంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని ప్రయాణికుల విశ్రాంతి భవనానికి కేటాయించాలని వినతిపత్రంలో కోరారు.



దత్తరామేశ్వరం ద్వాదశ బావుల్లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



మోపిదేవి ఆలయంలో జ్వాలా తోరణం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు



పృథ్వీశ్వరక్షేత్రంలో జ్వాలాతోరణం వెలిగిస్తున్న మండలి

భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు..జ్వాలా తోరణం

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లోను, దత్తరామేశ్వరం వద్ద ఉన్న ద్వాదశ బావుల్లో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో దీపారాధనలు చేశారు. దత్తరామేశ్వరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శివలింగాలకు స్వయం గా భక్తులు అభిషేకాలు చేశారు. పరమశివునికి కార్తీకమాసంలో అర్చనలు, అభిషేకాలు చేయడం వల్ల ఈతి బాధలు తొలగుతాయని మైసూరు దత్తపీఠం ఉత్తరాధిపతి విజయానంద తీర్థ స్వామి అన్నారు. దత్తరామేశ్వరంలో నగరేశ్వర స్వామి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రుద్రహోమంలో పాల్గొన్నారు. **పెడన :** గంగా పార్వతీ సమేత అగస్తేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జ్వాలా తోరణం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి జ్వాలా తోరణం కింద మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈవో టి.వి.వి. మోహనరావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ళ ప్రసాద్, ప్రధాన అర్చకుడు గూడూరు అగస్తయ్య సారథ్యంలో జ్వాలా తోరణం కన్నుల పండుగగా సాగింది. అగస్తేశ్వర స్వామిని అరుణాచలేశ్వర స్వామిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అరుణాచలేశ్వర స్వామి అలంకారంలో ఉన్న స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. **పెడన రూరల్ :** కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్వాలా తోరణాలను వెలిగించి ఉత్సవమూర్తులను ఊరేగించారు. చెన్నూరులోని గంగా పార్వతి సమేత నారద లింగేశ్వరస్వామి, ఉప్పలకలవగుంటలోని నాగేశ్వరస్వామి, ఉరివిలోని పార్వతి సమేత సోమేశ్వరస్వామి, మడకలోని భోగలింగేశ్వరస్వామి, చోడవరంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, నడుపూరు, కూడూరు, నందిగం, బల్లిపర్రు, లంకలకలవగుంటశివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిచారు. మహిళా భక్త బృందాలు లలితా పారాయణం పఠనం



పెడన అగస్తేశ్వర స్వామి ఆలయంలో జ్వాలా తోరణం



వినయ్ సాగర్ దంపతుల పూజలు

చేశారు. సహస్రదీపాలంకరణ చేశారు. **మోపిదేవి :** కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని పెదప్రోలు అద్దంకి నాంచారమ్మ ఆలయ ప్రాంగణంలో శివలింగాకారంలో సహస్ర దీపోత్సవం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి కె.వి.ఎస్.ఎస్.కోటేశ్వరరావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ధన్వంతరి ఆచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకనూరు వద్ద పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన మహిళలు ఉభయ ముక్తీశ్వర స్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఘంటసాల వెంకట సుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేశారు. సంతాన వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆలయ అర్చకుడు దీవి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వేకనూరు ఉభయ ముక్తీశ్వర స్వామి దేవాలయం లో మహిళలు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహించారు. **నాగాయలంక:** శ్రీరామపాదక్షేత్రం రామలింగేశ్వరస్వామి ఆలయంలో సజ్జనేని వినయ్ సాగర్, హరిత ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. నవహారతులు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల బుజ్జి, బోయపాటి రాము, తలశిల రఘుశేఖర్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మోపిదేవి, నడకుదురులో జ్వాలా తోరణం

మోపిదేవి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జ్వాలాతోరణ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని ఆలయ ప్రదక్షిణ గావించారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ అర్చక బృందం జ్వాలా తోరణం గావించారు. ఆలయ ఉద్యోగులు, భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. **చల్లపల్లి :** నడకుదురులోనిపృధ్వీశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక దీపోత్సవం అత్యంత శోభాయ మానంగా జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, మండలి వెంకట్రామ్, మండవ రవీంద్ర - రమణకుమారి దంపతులు, ఈవో యార్లగడ్డ వాసు - రమణకుమారి దంపతులు, నాదెళ్ల ప్రభాకరరావు దంపతులు, త్రివిక్రమరావు దంపతులచే ఆయల అర్చకులు మామిళ్లపల్లి కోటేశ్వరరావు, పృధ్వి, శివరామకృష్ణ, హేమంత్‌లు ప్రత్యేక పూజలు జరిపించారు. కార్తీక దీపం, వందలాది మంది భక్తుల సమక్షంలో జ్వాలాతోరణం వెలిగించారు. ప్రముఖులు యార్లగడ్డ శ్రీనివాసరావు, నాదెళ్ల వెంకట నరసయ్య, డా క్టర్ మనోజ్, పరుచూరి కమలాకరరావు, గుత్తికొండ వంశీకృష్ణ, రావెళ్ల విజయ్‌కుమార్, దుట్టా శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.చల్లపల్లి, లక్ష్మీపురం శివాలయాల్లో జ్వాలాతోరణం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలు, దంపతులు దీపారాధనలు చేశారు.

టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

మోపిదేవి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం కుటుంబానికి భరోసాలాంటిదని కె.కొత్తపాలెం సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు తెలిపారు. గ్రామంలోశుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే 215 మంది సభ్యత్వాలు తీసుకోవటం జరిగిందని, మరో రెండు రోజులు సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. సుబ్బారావు, అనిల్, యోసేబు తదితరులు పాల్గొన్నారు.

పెడనలో బీజేపీ సభ్యత్వ నమోదు

పెడన, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రాము అన్నారు. రెండవ వార్డులో శుక్రవారం బీజేతీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. జిల్లాలో లక్ష సభ్యత్వాలు చేర్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికి 60వేల సభ్యత్వాలు చేర్పించామన్నారు. బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శి పత్తిపాటి వెంకటరమణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కార్యదర్శి గొడవర్తి మంజూష పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో అన్నసమారాధన

పెడన, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయం (ఘటం గుడి)లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తోట పైడేశ్వరరావు, నిమ్మగడ్డ నాగ మల్లేశ్వరరావు, ఏ. గౌరీప్రసాద్, వన్నెంరెడ్డి మహంకాళరావు, తోట మహశ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి మంచం వితరణ

ఘంటసాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల గ్రామానికి చెందిన దోనేపూడి వీర రాఘవేంద్రరావు కుమారుడు దోనేపూడి వెంకట రామకృష్ణ చౌదరి ఘంటసాల పిహెచ్‌సీకి ఉపయోగపడే విధంగా సుమారు రూ.30 వేలు విలువ చేసే మంచాన్ని వైద్యాధికారి వేమూరి ప్రమోద్ కుమార్‌కు అందజేశారు. వేమూరి వెంకట్రావు, వేమూరి ప్రవీణ్, వేమూరి రత్నశేఖర్, గొర్రెపాటి జగన్మోహన్‌రావు, గొర్రెపాటి మధుసూదనరావు, పిడిగే రామకృష్ణ అందజేశారు.



పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న కమిషనర్ బాపిరాజు



పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న రజనీకుమారి



గూడూరులోమాట్లాడుతున్న సురేష్

గ్రంథపఠనంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రంథపఠనంపై బాల్యం నుంచి ప్రత్యేక దృష్టి సారించాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు అన్నారు. ఈడేపల్లి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, డీవైఈవో శేఖర్‌సింగ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. . జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను జిల్లా గ్రంథాలయ శాఖాధికారి వి. రవికుమార్ ప్రారంభించారు. సాహితీ మిత్రులు సంస్థ ఆధ్వర్యంలో మేడిశెట్టి యోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కవులు తమ కవితలను వినిపించారు. మేరీకృపాబాయి, న్యాయవాది పోతు ల మురళీకృష్ణ, కారుమూరి రాజేంద్రప్రసాద్, ఆర్.వి.ఎస్. మురళీధర్, కోన వెంకటేశ్వరమ్మ, ఎంఎస్ఎన్ మూర్తి, కనకదుర్గామహాలక్ష్మి, దత్తాత్రేయ శర్మ, పోతురాజు, కాగిత సాంబశివరావు, బత్తిన అగస్తేశ్వర రావు పాల్గొన్నారు. **పెడన :** పెడన శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ళ మల్లిఖార్జున ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రవికుమార్, అభివృద్ధి కమిటీ సభ్యులు కట్టా గణేష్, వేముల రమేష్, బొడ్డు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** పుస్తక పఠనంతోనే జ్ఞాన సముపార్జన సాధ్యమని ఎంపీపీ వేమూరి రజనీకుమారి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఘంటసాల శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. చిన్నతనం నుంచి విద్యార్థులు పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. కొడాలి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను శ్రీ శ్రీనివాస బాల విద్యాలయం స్కూల్ ప్రిన్సిపాల్ వసుంధర దేవి ప్రారంభించారు. ఫ్యాన్సీ డ్రెస్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శ్రీకాకుళం శాఖా గ్రంథాయలంలో గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్ ఆదిరాల కనకదుర్గ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఖో-ఖో పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను గ్రంథాలయాధికారులు దారా సుజా త, ఎం.సుబ్బారావు, ఎం.శరత్ కుమార్‌లు పర్యవేక్షించారు. **గూడూరు :** గ్రంథపఠనంతో జ్ఞానం పెంపొందించుకోవచ్చని జడ్పీటీసీ వేముల సురేష్‌రంగబాబు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గూడూరు గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రంథాలయ నిర్వాహకుడు వై. శ్రీనివాసరావు, బత్తిన నరసింహ స్వామి, బిడిఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.**మోపిదేవి :** పెదకళ్లేపల్లి, రావివారిపా లెం శాఖా గ్రంథాలయాల్లో సోమలత, సుధీర్ కుమార్ పర్యవేక్షణలో పుర ప్రముఖులు పుస్తకాలను పరిశీలించారు.

బాబాప్రసాద్‌కు పరామర్శ

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సతీ వియోగానికి గురైన మునిసిపల్ మాజీ చైర్మన్ మో టమర్రి బాబాప్రసాద్‌ను శుక్రవారం సీపీఐ నేత మోదుమూడి రామారావు తదితరులు పరామర్శించారు.

